క్లుప్తంగా

టీఆర్టీ, టెట్‌లో అవకాశం కల్పించాలి

రెబ్బెన: ఎన్‌ఐవోఎస్ ద్వారా టీటీసీ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు టీఆర్టీ, టెట్‌లో అవకాశం కల్పించాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. బుధవారం కలెక్టర్ వెంకటేష్ దౌత్రేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2016 – 18 సంవత్సరాల్లో ప్రభుత్వం ఎన్‌ఐవోఎస్ ద్వారా రెగ్యులర్ టీటీసీతో సమానంగా రెండు సంవత్సరాలు టీటీసీ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారన్నారు. ప్రభుత్వం ఎన్ఐవోఎస్ ద్వారా టీటీసీ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు టీఆర్టీ, టెట్‌లకు అవకాశం ఇవ్వకపోవడంతో రెండేళ్ల టీటీసీ ట్రైనింగ్‌కు విలువ లేకుండా పోతోందన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సెల్‌ఫోన్ పోగొట్టుకొని ఫిర్యాదు చేసిన బాధితుడికి సెల్‌ఫోన్‌ను గుర్తించి అప్పగించారు. ఆయన మాట్లాడుతూ గుడ్లబోరి గ్రామానికి చెందిన గుండ్ల అంజి ఇటీవల రూ.25 వేల విలువ గల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారన్నారు. సీఈఆర్ ద్వారా ఫిర్యాదు చేయగా ఫోన్ ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ప్రచారరథం ప్రారంభం


పార్టీ రథాన్ని ప్రారంభిస్తున్న కుసుంబ్‌రావు

కెరమెరి: వచ్చే నెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రచార రథాన్ని పార్టీ మండలాధ్యక్షుడు ఆత్రం కుసుంబ్‌రావు ప్రారంభించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు రథం మండలంలోని అన్ని గ్రామాల్లో తిరుగుతుందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. నాయకులు బాబునాయక్, జగన్నాథరావు, దండుగుల శ్రీనివాస్, పెందోర్ జలపతిరావు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సదాశివ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ మాన్సూన్ తనిఖీ ప్రోగ్రామ్ ఉన్నందున కలెక్టర్ ఆఫీస్, ఎస్పీ ఆఫీస్, జెడ్పీ కార్యాలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నంబాలలో..


రెబ్బెన: మండలంలోని నంబాలలో గురువారం విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. గ్రామంలోని విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పెంచికల్‌పేట్: మండలంలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు బుధవారం పరిశీలించారు. పెంచికల్‌పేట్, ఎల్లూర్, ఎల్కపల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల నేపథ్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు ఆర్ఐ గోపాల్ ఉన్నారు.

కెమికల్ వ్యాన్ బోల్తా


బోల్తాపడిన కెమికల్ వ్యాన్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బురదగూడెం సమీపంలో గల బొక్కెనవాగు వంతెన వద్ద బుధవారం కెమికల్ వ్యాన్ బోల్తా పడింది. ఎస్పీఎం మిల్లుకు కెమికల్‌ను తీసుకొస్తున్న వ్యాన్ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి వంతెన వద్ద బోల్తాకొట్టింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

తిర్యాణి విద్యార్థుల ప్రతిభ


గున్నాల పూజిత

తిర్యాణి: ఇంటర్ ఫలితాల్లో మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థి గున్నాల పూజిత బైపీసీ విభాగంలో 440 మార్కులకు 436 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 208 మంది విద్యార్థులకు 176 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గిరిజన గురుకుల కళాశాలకు చెందిన 159 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 158 మంది ఉత్తీర్ణత సాధించారు.

ప్రతిభ చాటిన గురుకుల విద్యార్థులు


పి.జీవన్

సిర్పూర్(టి): ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన శ్రీజన్య ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 953, బైపీసీలో జి.శ్రీజ 964, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో ఎం.శిరీష 454, బైపీసీలో పి.అంకిత, టి.రాజేశ్వరం 430, సాంఘిక సంక్షేమ డీపీఐపీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ఆర్.నికిత సీఈసీ ద్వితీయ సంవత్సరంలో 934, ప్రథమ సంవత్సరం సీఈసీలో శ్రుతి 476, ప్రథమ సంవత్సరం హెచ్ఈసీలో శ్రీనిధి 452, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల సిర్పూర్(టి)కి చెందిన పి.జీవన్ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంఈసీలో 925, కె.రాజ్‌కుమార్ సీఈసీలో 898, ఎంఈసీ ప్రథమ సంవత్సరంలో టి.రామ్‌చరణ్ 461, ప్రథమ సంవత్సరం సీఈసీలో సరిపుత్ 474 మార్కులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

మెరిసిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు


మల్లీశ్వరీ


వర్ష


గుర్లె గౌరు

రెబ్బెన: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చాటుకున్నారు. మండలంలోని గంగాపూర్ కేజీబీవీలో మొదటి సంవత్సరంలో 64 మంది విద్యార్థులకు 60 మంది ఉత్తీర్ణత సాధించగా 92 శాతం, ద్వితీయ సంవత్సరంలో 57 మంది విద్యార్థులకు 56 మంది విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో పద్మ తెలిపారు. కళాశాలకు చెందిన బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినీ గుర్లె గౌరు 959 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలవగా, ఎంపీసీ విద్యార్థినీ వడాయి అక్షయ 924 మార్కులు, మొదటి సంవత్సరంలో వర్ష 440 మార్కులకు 427 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీ విద్యార్థినీ బోయిరే మల్లేశ్వరీ 870 మార్కులు సాధించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీశ్ తెలిపారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ కోర్సుల్లో యాదగిరి అంజన్న 462, ద్వితీయ సంవత్సరంలో రిటైల్ మేనేజ్‌మెంట్ కోర్సులో గొత్రే అరవింద్ 933 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరం సీజీటీలో నాగుల రమ్య 457 మార్కులు, ద్వితీయ సంవత్సరం సీజీటీలో చదువుల అనుష 898 సాధించినట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ రెసిడెన్సియల్ పాఠశాల, కళాశాలకు చెందిన ఎంపీసీ విద్యార్థిని అశ్మిత 957 మార్కులు, అహన్యా 957, శివానీ 944, బైపీసీలో వైష్ణవి 968, సమత 959, మొదటి సంవత్సరం ఎంపీసీలో హారిక 461, నందినీ 435, బైపీసీలో జయరాణి 430, మహిత 421 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు.

తగ్గిన ఉత్తీర్ణత

దహెగాం: ఇంటర్ ఫలితాలు బుధవారం వెలువడగా మండలంలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 80 శాతం, ద్వితీయ సంవత్సరంలో 85శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అమరేందర్ రెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో పాలె అంజలి 928 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. సీఈసీలో దెబ్బటి హరిక్రిష్ణ 862 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం బైపీసీలో పాలె సంజలి 378 మార్కులు సాధించగా, సీఈసీలో భీమస్‌కర్ రాణి 382 మార్కులు సాధించింది. స్థానిక కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 77శాతం, ద్వితీయ సంవత్సరంలో 99శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌వో రిజ్వాన తెలిపారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో నక్క మాలిక 870 మార్కులు సాధించింది, బైపీసీ సెకండియర్‌లో హస్త బిందు 908, ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో లింగంపల్లి దివ్యాంజలి 423, బైపీసీ ఫస్టియర్‌లో ఎన్నంపల్లి ఐశ్వర్య 408 మార్కులు సాధించి కేజీబీవీ టాపర్‌గా నిలిచింది.


పాలె అంజలి


దెబ్బటి హరిక్రిష్ణ


నక్క మాలిక


బిందు

మెరుగైన ఫలితాలు

కౌటాల: కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. ఇంటర్ ఫస్ట్‌ఇయర్ జనరల్‌లో 176 మంది విద్యార్థులకు గాను 161 మంది, వొకేషనల్‌లో 114 మందికి 97 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్ జనరల్‌లో 152 మందికి 132 మంది, వొకేషనల్‌లో 130 మందికి 124 మంది ఉత్తీర్ణత సాధించా రు. ద్వితీయ సంవత్సరం బైపీసీలో బీరయ్య 771 మార్కులు, వొకేషనల్ గ్రూప్‌ల్లో సులోచన 933, సంజీవ 924, అంకిత 935, పావని 967 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. మొదటి సంవత్సరం వొకేషనల్ గ్రూప్‌లల్లో రాజేంద్రప్రసాద్ 485, సంతోష్ 411, అజయ్‌కుమార్ 475 మార్కులు సాధించారు. హైదరాబాద్‌లో చదువుతున్న బోదంపల్లి గ్రామానికి చెందిన గీతా భవాని ఫస్ట్ ఇయర్ బైపీసీలో 437 మార్కులు, మండల కేంద్రానికి చెందిన ఆకాశ్ ఎంపీసీలో 468 మార్కులు సాధించారు.

కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత


ఎం.శ్రీలత


ఎం.సరిత


కే.రుక్మాబాయి


బి.రేణుక

కెరమెరి: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మండలంలోని మోడి కేజీబీవీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇయర్‌లో 36, సెకండ్ ఇయర్‌లో 33 మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా.. అందరూ ఉత్తీర్ణత సాధించారు. టాపర్లుగా ఫస్ట్‌ఇయర్ బైపీసీలో కొట్రంగే రుక్మాబాయి 409, బామ్నె రేణుక 403, సెకండ్ ఇయర్ బైపీసీలో మోహర్లె శ్రీలత 912, మాండోరే సరిత 898 మార్కులు సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్‌లో 104 మందికి 68, సెకండ్ ఇయర్‌లో 112 మందికి 106 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. టాపర్లుగా సెకండ్ ఇయర్ బైపీసీలో రోజా 855, ఎంపీసీలో జనాబాయి 852, ఫస్ట్ ఇయర్‌లో కరన్, 422, విఠల్ 404 మార్కులు సాధించారు.

27న బెజ్జూర్‌కు సీతక్క రాక

బెజ్జూర్: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, పార్లమెంట్ అభ్యర్థి సుగుణ, ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కృష్ణారావులు ఈనెల 27న మండల కేంద్రానికి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ ఏరియాలో బుధవారం సభ స్థలాన్ని పరిశీలించారు. సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ల ఆదేశాల మేరకు సభ స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు బషారత్ ఖాన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వెంకన్న, నాయకులు ఉన్నారు.

వైభవంగా 'మహంకాళి' బోనాలు


బోనాలతో ఆలయానికి వస్తున్న భక్తులు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల స్వయంభూ మహంకాళి ఆలయంలో చైత్రపౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న జాతరలో రెండోరోజు బుధవారం అమ్మవారి బోనాల కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జిల్లా భక్తులతో పాటు పక్క జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలిరావటంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి బోనాలను తలపై ఎత్తుకొని డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల నడుమ ఆలయానికి తీసుకురాగా భక్తులు బోనాలను దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి బోనాలు, పట్టు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక పల్లకీలో శోభాయాత్ర నిర్వహించారు.


ఆలయంలో భక్తుల సందడి

కేజీబీవీలో 95శాతం ఉత్తీర్ణత


రాచకొండ అక్షిత

బెజ్జూర్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థులు ప్రైవేటుకు ధీటుగా ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రత్యేక అధికారి అరుణ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరంలో 95 శాతం ఫలితాలు రాగా, ప్రథమ సంవత్సరంలో 65 శాతం వచ్చినట్లు పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూలో జున్నుగారి లక్ష్మి 948 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. నాగమణి 895 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచింది.

మండల టాపర్‌గా అక్షిత

ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన రాచకొండ స్వప్న –నగేష్ దంపతుల పెద్ద కూతురు రాచకొండ అక్షిత ప్రతిభ కనబర్చారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 462 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. ఈమె హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన రాజేశ్


నాగరగోజే రాజేశ్

లింగాపూర్: మండలంలోని వంజారిగూడ గ్రామానికి చెందిన నాగర్‌గోజే రాజేశ్ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం బైపీసీ ఫలితాలలో 440 మార్కులకు 436మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచాడు. రాజేశ్ బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ కళాశాలలో చదువుతున్నాడు.

అభివృద్ధి కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఇచ్చోడ: అభివృద్ధి కోసం పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కోరారు. బుధవారం మండలంలోని నర్సాపూర్, సిరిచెల్మ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ నాయకులు మహిముద్‌ఖాన్, ముస్తాఫా, అజీం సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలకు పక్కా భవనమేది?

- ఏళ్లుగా పెండింగ్‌లో కొత్త భవన నిర్మాణ పనులు
- పాఠశాల భవనంలో కొనసాగుతున్న పశు వైద్యశాల
- ఇన్‌చార్జి పశువైద్యాధికారే దిక్కు
- పట్టించుకోని ఉన్నతాధికారులు


పాఠశాల భవనంలో కొనసాగుతున్న పశువైద్యశాల


దహెగాంలో అసంపూర్తిగా పశువైద్యశాల భవనం

దహెగాం: మండలంలో పశువైద్యశాలకు పక్కా భవనం మంజూరైనా పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో పాఠశాల భవనంలో పశువైద్యశాల కొనసాగుతుండగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనే పశువులకు వైద్యం అందించడానికి మండల కేంద్రాల్లో పశు వైద్యశాలలను ఏర్పాటు చేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. పశు వైద్యశాల భవనం కోసం 16 ఏళ్ల క్రితం అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఐడీఎఫ్ నిధులు రూ.16 లక్షలతో మండల కేంద్రంలో పశు వైద్యశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు స్లాబ్ వరకు జరిగి మధ్యలోనే ఆగిపోయాయి. పశువైద్యశాలకు పక్కా భవనం లేకపోవడంతో మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతోంది. అదేవిధంగా రెగ్యులర్ పశువైద్యాధికారులను నియమించడంలో ప్రభుత్వం విఫలమవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అసంపూర్తిగానే భవనం..

మండల కేంద్రంలో పశువులకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో పక్కా భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. స్లాబ్ వరకు పనులు పూర్తి చేసి గోడలు నిర్మించి వదిలేశారు. దీంతో పశువులకు వైద్యం అందని ద్రాక్షగానే మిగిలింది. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వం ఆర్ఐడీఎఫ్ కింద రూ.16 లక్షలతో భవనం ప్రారంభించింది. కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశారు. నిధులు ఏపీ రాష్ట్రానికి తరలినట్లు అధికారులు పేర్కొంటున్నారు. అప్పటి నుంచి భవన నిర్మాణంపై ఎవరూ దృష్టి సారించలేదు. పశువైద్యశాల భవనం అసంపూర్తిగా ఉండగా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వమైనా ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాఠశాల భవనంలో పశువైద్యశాల..

మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక పాఠశాల భవనంలో పశువైద్యశాల కొనసాగుతోంది. భవనంలో ఒకే గది ఉండడంతో పశువులకు సంబంధించిన మందులు నిల్వ చేసిన గదిలోనే పశువైద్యాధికారి సైతం ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇరుకుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సిబ్బంది వాపోతున్నారు.

మండలంలో 33,041 పశువులు..

మండలంలో మొత్తంగా 33,041 పశు సంపద ఉంది. ఇందులో ఆవులు, ఎద్దులు 17,055, గేదెలు 3,575, మేకలు 9,304, గొర్రెలు 3053 వరకు ఉన్నాయి. వీటితో పాటు పందులు 54 ఉండగా, కోళ్లు 8500 ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ లెక్కలు చెబుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఇట్యాల గ్రామంలో పశువైద్యశాలలు ఉన్నాయి. రెండు పశు వైద్యశాలలు ఉన్నా రెగ్యులర్ పశువైద్యాధికారులు లేక ఇన్‌చార్జీలతోనే నెట్టుకొస్తున్నారు. తిర్యాణి మండలం గిన్నెధరి పశువైద్యాధికారి దహెగాం, ఇట్యాలకు ఇన్‌చార్జీగా కొనసాగుతున్నారు. పశువైద్యశాల అసంపూర్తిగా ఉన్నందున జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భవనాన్ని పూర్తి చేసి పశువులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం..



మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాల ప్రస్తుతం పాఠశాల భవనంలో కొనసాగుతోంది. 16 ఏళ్ల క్రితం పక్కా భవనం అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం.

– శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జి పశువైద్యాధికారి, దహెగాం

పిచ్చికుక్కల స్వైరవిహారం


గాయపడిన బాలుడు

బెజ్జూర్: పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తూ ముగ్గురు చిన్నారులపై దాడి చేశాయి. మండల కేంద్రంలో గోల్కొండ కాలనీకి చెందిన వశాక సుశాంత్, అదే కాలనీకి చెందిన మరో అమ్మాయితో పాటు మండలంలోని ఇందూరుగాం గ్రామానికి చెందిన ఐదేళ్ల బాలుడు సాయితేజ పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు. బుధవారం ముగ్గురిపై వేర్వేరు చోట్ల కుక్కలు దాడి చేశాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చింతలమానెపల్లి: ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ సాదిక్ పాషా అన్నారు. బుధవారం మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళి అమలులో ఉందని, ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసులు, అధికారులు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఐతో పాటు చింతలమానెపల్లి ఎస్సై నరేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలి

బేల: ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయాలని తహసీల్దార్ సవాయిసింగ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో ఓటరు స్లిప్‌ల పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు స్లిప్‌లను కచ్చితంగా సంబంధిత ఓటర్లకే ఇవ్వాలని, ఇతరులకు ఇవ్వరాదని, రాజకీయ నాయకులు ఇవ్వద్దన్నారు. వచ్చే నెల 8లోపు పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. తర్వాత బూత్‌ల వారీగా బూత్ లెవల్ అధికారులకు ఓటరు స్లిప్‌లు, ఓటరు గైడ్, సి విజిల్ యాప్ పత్రాలను అందజేశారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సిడాం వామన్‌రావు, సూపర్‌వైజర్‌లు గీత, సాజిద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించండి

ఉట్నూర్‌రూరల్: విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మండల విద్యుత్ శాఖ అధికారికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని లింగోజీతండా గ్రామస్తులు అందజేశారు. బుధవారం గ్రామస్తులు మాట్లాడుతూ.. లో ఓల్టేజీ విద్యుత్ రావడంతో నీటి బోరు, ఫ్యాన్లు, ఫ్రిజ్, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయన్నారు. సమస్యలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు జగదీష రవికుమార్, వసంతరావు, మీరామన్, సంజీవ్, మహేశ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఒకరిపై కేసు నమోదు

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో మద్యం విక్రయిస్తున్న మహోల్కర్ సతీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా, మహోల్కర్ సతీశ్ దుకాణంలో 5.25 లీటర్ల మద్యం లభించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.